క్లుప్తంగా

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి



వాహన రికార్డులు పరిశీలిస్తున్న సీఐ రమేష్

చింతపల్లిరూరల్: వాహనచోదకులు తమ వెంట లైసెన్స్‌తో పాటు వాహన పత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని హనుమాన్ జంక్షన్ వద్ద సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మైనర్లు వాహనాలు డ్రైవింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఐ అరుణ్‌కిరణ్, సిబ్బంది ఉన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

పెదబయలు: మండలంలోని ప్రజలు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య కోరారు. అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశాల మేరకు స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఆధార్ కేంద్రం ప్రారంభించినట్టు తెలిపారు. ఆధార్ కార్డు, కార్డులో వివరాల్లో మార్పు చేర్పులు, విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ తదితర సేవలను కేంద్రం నుంచి పొందవచ్చన్నారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల ప్రజలు ఈ కేంద్రం ద్వారా అందుతున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. ప్రతీ సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కేంద్రం పనిచేస్తోందని, మిగిలిన రోజుల్లో పెదబయలు గ్రామ సచివాలయంలో సేవలందిస్తామన్నారు. గ్రామస్తులు, విద్యార్థుల తల్లితండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ సచివాలయం సిబ్బంది రవిరాజు, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా సీతయ్య బాధ్యతల స్వీకరణ



కొయ్యూరు: ఎంపీడీవోగా లాలం సీతయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతగిరిలో ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న అతనిని ఎంపీడీవోగా నియమిస్తూ ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఈవోపీఆర్డీ నాయుడు, ఏపీవో రాజు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండలానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన మేరీరోజ్‌ను డిప్యూటేషన్‌పై పాడేరు కలెక్టరేట్‌కు బదిలీ చేశారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి

జి.మాడుగుల: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మండల అంగన్‌వాడీ కార్యకర్తల నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు లక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. మండల అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలిగా గిడ్డి మోదకొండమ్మ, ఉపాధ్యక్షురాలిగా రాజేశ్వరి, కార్యదర్శిగా వరహాలమ్మ, కోశాధికారులుగా అన్నపూర్ణ, కాంతమ్మ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు మోదకొండమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల సాధనకు కృషి చేస్తానని తెలిపారు.

సెల్ టవర్ నిర్మించాలని వినతి



రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని మాకవరం పంచాయతీ మేభ గ్రామంలో మంజూరైన జియో సెల్ టవర్ నిర్మించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం తహసీల్దార్, పోలీసు అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి 2022లో జియో సెల్ టవర్ మంజూరైందని, పనులపై గ్రామస్తులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేసి అధికారులకు పత్రాన్ని అందజేశామని గ్రామస్తులు చెప్పారు. కాని ఇప్పుడు తమ గ్రామంలో కాకుండా వేరే గ్రామం టవర్ పనులు చేపట్టడం ఎంతవరకు న్యాయమని పేర్కొన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి మేభ గ్రామంలో సెల్ టవర్ నిర్మించి, సెల్ సేవలు అందేలా చూడాలని గ్రామస్తులు కోరారు.

కానుక.. వేడుక



పుస్తకాలు అందుకున్న సంతోషంలో విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా జగనన్న విద్యా కానుక కిట్‌ల పంపిణీని వేడుకలా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం పండగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రెట్టించిన ఆనందంతో కార్యక్రమానికి తరలివచ్చారు. ప్రభుత్వం అందించిన జగనన్న విద్యా కానుక కిట్‌లో యూనిఫాం, షూ, బెల్టు, బ్యాగు తదితర సామగ్రి చూసి విద్యార్థులు పులకించిపోయారు. థ్యాంక్యూ జగన్ మామయ్య అంటూ కృతజ్ఞతలు తెలిపారు. నాణ్యమైన విద్యకు ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధకు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

- పాఠశాలల్లో పండగ వాతావరణం
- విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేత
- ఆనందంలో విద్యార్థులు, తల్లిదండ్రులు



చింతూరులో ఉపాధ్యాయులకు జేవీకే కిట్‌లు అందజేస్తున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

చింతూరు: పాఠశాలలు పున:ప్రారంభం కావడంతో విద్యార్థులు తొలిరోజు ఎంతో ఉత్సాహంతో పాఠశాలల్లో అడుగుపెట్టారు. గత తరగతుల నుంచి పై తరగతులకు చేరుకున్న విద్యార్థులతో పాటు కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థుల రాకతో పాఠశాలల్లో కోలాహల వాతావరణం నెలకొంది. తమ పిల్లలను పాఠశాలకు వదిలేందుకు వచ్చిన తల్లిదండ్రులతో సర్కారు బడుల్లో సందడి వాతావరణం నెలకొంది. నాడు–నేడులో భాగంగా పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. కొత్త సొబగులు సంతరించుకున్నాయి. గతంలో కంటే మారిన పాఠశాలలు ఎంతో బాగున్నాయని, విద్య నేర్చుకునేందుకు ఎంతో మంచి వాతావరణం ప్రస్తుత పాఠశాలల్లో నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. సర్కారు బడుల్లో ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యతో పాటు సదుపాయాలతో విద్యార్థులు రెట్టించిన ఉత్సాహంతో పాఠశాలలకు వచ్చేందుకు ఎంతో ఉత్సాహం చూపుతున్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలు పున:ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ జోరుగా సాగుతోంది. ఇప్పటికే చాలామంది ఉపాధ్యాయులు తమ పాఠశాలలకు చెందిన కిట్లను తీసుకువెళ్లారు. చింతూరు మండలంలో 106 పాఠశాలలుండగా 6,515 మంది విద్యార్థులున్నారు. ఈ ఏడాది జగనన్న విద్యాకానుకలో భాగంగా మండలంలోని పాఠశాలలకు 31,170 నోటుపుస్తకాలు, 39,624 పాఠ్యపుస్తకాలు, 10,645 వర్క్‌బుక్స్ వచ్చినట్టు ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. పాఠశాలలు తెరచిన తొలిరోజునే విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు.

ఉపాధ్యాయుల బదిలీ

ఇటీవల నిర్వహించిన బదిలీల ప్రక్రియలో భాగంగా చింతూరు మండలంలో 46 మంది ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు పాఠశాలల్లో విధుల్లో చేరినట్టు ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు.



సింగంపల్లిలో విద్యార్థులకు జేవీకే కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటలక్ష్మి తదితరులు

ఆనందంగా ఉంది



పాఠశాల గతంలో కంటే ఎంతో బాగుంది. నాడు–నేడు ద్వారా మా పాఠశాలలో అనేక మౌలిక సౌకర్యాలు కల్పించారు. రెండో దశలో భాగంగా అదనంగా తరగతి గదులు నిర్మిస్తున్నారు. బడి అభివృద్ధితో ఆనందంగా ఉంది.

–బత్తుల జ్యోత్స్నశ్రీ, ఎనిమిదో తరగతి, చింతూరు

జేవీకే కిట్ బాగుంది



పాఠశాల తొలిరోజునే మాకు పుస్తకాలు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది. జగనన్న విద్యాకానుక ఎంతో బాగుంది. బ్యాగు, షూ, బెల్ట్, పుస్తకాలు అందివ్వడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం అందిస్తున్న ఈ కిట్ ద్వారా మా తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతోంది.

– ఎంఏ హన్నాన్, పదో తరగతి, చింతూరు

తొలగిన రేషన్ కష్టాలు



బాలరేవులలో బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

కొయ్యూరు: బాలరేవుల, జువ్విరేవుల, కొత్తపల్లి, చల్లిగెడ్డ, చీడిపల్లితో పాటు మరికొన్ని గ్రామాల ప్రజలకు కష్టాలు తీరాయి. ఇంత వరకు చాలా గ్రామాలకు సంబంధించిన బాలరేవుల రేషన్ డిపోను కొయ్యూరులో నిర్వహించేవారు. దీంతో శివారు గ్రామాల నుంచి ప్రజలు రేషన్ సరకులు తీసుకోవడానికి అవస్థలు పడాల్సి వచ్చేది. రాకపోకలకు అధికంగా ఖర్చు చేయాల్సి వచ్చేది. ఇక్కడ సమస్యను స్థానికులు పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే విషయాన్ని కొయ్యూరు తహసీల్దార్, జీసీసీ బ్రాంచ్ మేనేజర్‌కు తెలియజేశారు. దీంతో ఈ నెల నుంచి రేషన్ నేరుగా బాలరేవుల తరలించి పంపిణీ చేస్తున్నారు. ఒకరి ఇంటిలో డిపోను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. రేషన్ కష్టాలు తొలిగాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేసి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు.

పంటలకు మద్దతు ధర



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

చింతపల్లిరూరల్: పసుపు సాగుచేస్తున్న రైతులు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య అన్నారు. మండల కేంద్రంలో పసుపు కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. దళారులకు విక్రయించుకోని నష్టపోకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడంతో అదనపు ఆదాయం పొందవచ్చాన్నారు. ఒక్కో రైతు వద్ద 30 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేస్తామన్నారు. క్వింటాకు రూ. 6850 ధర చెల్లిస్తామన్నారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ జాహ్నవి, జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం కె.రమేష్, కంఠ బాలకర్ణ, వెలుగు ఏపీఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు



సమావేశంలో సమస్యలు వివరిస్తున్న వైద్యాధికారి డేవిడ్

దేవీపట్నం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు సకాలంలో స్పందించి మెరుగైన వైద్య సేవలందించేలా చూడాలని ఎంపీపీ కుంజం మురళీ అన్నారు. ఇందుకూరుపేట పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డేవిడ్ పలు సమస్యలు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పీహెచ్‌సీ ప్రాంగణంలో ఓపీ విభాగానికి నూతనంగా షెడ్డు నిర్మించాలని, ఆస్పత్రి వద్ద కోతుల బెడద ఎక్కువగా ఉందని ప్రవేశద్వారం వద్ద ఇనుప చత్రాలు ఏర్పాటు చేయాలని, పిహెచ్‌సి ఎదుట సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. దీనిపై స్పందించిన ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ మండల పరిషత్ నిధుల నుంచి ఏర్పాటు చేస్తామని పీహెచ్‌సీకి నైట్ వాచ్‌మేన్‌ను నియమిస్తామన్నారు. ఈ సందర్భంగా రెగ్యులర్ ఎంపీడీవో రత్నకుమారిని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణి, గారపాటి మురళీకృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మనశ్శాంతి



చిద్గగానానంద మహర్షుల విగ్రహం వద్ద పూజలు చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: మండలంలోని సింగర్భ పంచాయతీ ఊబలగరువు గ్రామంలో భగవాన్ చిద్గగానానంద మహర్షుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన హోమం ఇతరత్రా పూజా కార్యక్రమాల్లో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. చిద్గగానానంద మహర్షుల విగ్రహానికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠకు విచ్చేసిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికు గ్రామస్తులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం కలిగి ఉండాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మనశ్శాంతి కలుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు పాంగి లక్ష్మి, సర్పంచ్ మసాడి గంగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నుర్మని మత్స్యకొండంనాయుడు, నాయకులు చిట్టిబాబు, చిన్నబాబుఆచారి, పొంగి రామకృష్ణ, వీఆర్పీ శ్రీహరితో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భీమిలి సద్గురు సేవాశ్రమం ప్రతినిధి స్వామిజీ, భక్తులు

జి.మాడుగుల: మండలంలో వంజరి పంచాయతీ గొప్పులపాలెంలో భీమిలి సద్గురు సేవాశ్రమం ప్రతినిధి సాయిరాం స్వామిజీ అధ్వర్యంలో వేద మంత్రాల నడుమ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. భక్తులకు అన్న సమారాధన జరిగింది. విశ్వహిందూ పరిషత్ జిల్లా ధర ప్రచార ప్రముఖ్ అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వంజరి సన్యాసినాయుడు, గ్రామ పెద్దలు చైతన్య, కృష్ణ, భీమన్న, గోవింద్ తదితరలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల సంబరాలు



పాడేరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, చిత్రంలో నేతలు

జి.మాడుగుల: పాడేరు ఎమ్మెల్యేగా కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రమాణ స్వీకారం చేసి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జి.మాడుగులలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన వేడుకలో వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, సీదరి కొండబాబు, మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యకొండం నాయుడు కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. గ్రామ వలంటీర్లు రాంబాబు, ఉమకల్యాన్, శోభన్ తదితరలు పాల్గొన్నారు.

సాక్షి, పాడేరు: ఎమ్మెల్యే కొట్టుగుళ్లి భాగ్యలక్ష్మి ఎమ్మెల్యేగా ప్రమాణం చేసి నాలుగేళ్లయిన సందర్భంగా పాడేరులోని పార్టీ నాయకులు విజయోత్సం నిర్వహించారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి పార్టీ నేతలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

వరి విత్తనాల పంపిణీ



ఇందుకూరుపేటలో వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మురళీ, జెడ్పీటీసీ సత్యవేణి తదితరులు

దేవీపట్నం: ప్రభుత్వం రైతుల కందిస్తున్న సబ్సిడీ వరి విత్తనాలను సద్వినియోగం చేసుకుని మంచి దిగుబడులు సాధించాలని ఎంపీపీ కుంజం మురళీ అన్నారు. ఇందుకూరుపేటలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం 90 శాతం రాయితీపై సరఫరా చేసిన వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన పంపిణీ నుంచి ధాన్యం కొనుగోలు వరకూ ప్రభుత్వమే ఆర్‌బీకేల ద్వారా అమలుచేస్తోందన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణి, ఎంపీడీవో రత్నకుమారి, పార్టీ నాయకులు కందుల బాబ్జి, శిరశం పెద్దబ్బాయిదొర, గారపాటి మురళీకృష్ణ, కారం కృష్ణబాబు, కొమరం లక్ష్మీదేవి, కాలచర్ల రవి, వీహెచ్‌ఎ భవానీ తదితరులు పాల్గొన్నారు.



గంగవరంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ గంగాదేవి, సర్పంచ్ అక్కమ్మ

గంగవరం: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వరి విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి, సర్పంచ్ అక్కమ్మ రైతులను సూచించారు. గంగవరం సచివాలయం పరిధిలోని గిరిజన రైతులకు కొత్తాడ రైతు భరోసా కేంద్రం వద్ద విత్తనాలను సోమవారం వారు పంపిణీ చేశారు. వ్యవసాయ సహాయకులు రెహనా సుల్తానా, గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం పెద్దపీట



అల్లంపుట్టులో విద్యార్థులకు జేవీకే కిట్‌లు అందజేస్తున్న ఉపాధ్యాయులు



చింతపల్లిలో విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేస్తున్న ఏటీడబ్ల్యూవో జయలక్ష్మి తదితరులు



ముంచంగిపుట్టులో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ త్రినాథ్

హుకుంపేట: వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలు సోమవారం పున:ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్‌లు అందజేశారు. హుకుంపేట మండలంలోని కొట్నాపల్లి ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో బాబూరావు స్థానిక విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్‌లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందన్నారు. విద్యాభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో విద్య అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కె.త్రినాథ్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని తదనుగుణంగా కృషి చేస్తే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఇంటర్, పదో తరగతి పాసైన విద్యార్థులకు పుస్తకాలను బహుమతులుగా అందజేసి, వారి లక్ష్యంపై అవగాహన కల్పించారు. విద్య అభివృద్ధి వేదిక నాయకులు విక్రమ్, నవీన్, ఆనంద్, కుమారి, దేవి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని పాఠశాలల్లో ఏటీడబ్ల్యూవో జయలక్ష్మి ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్‌లను పంపిణీ చేశారు. వార్డెన్ నూకరత్నం, హెచ్‌ఎం కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు సింగంపల్లి పాఠశాలల్లో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి జగనన్న విద్యా కానుక కిట్‌లను పంపిణీ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిస్ట్రిబ్యూషన్ కేంద్రంగా ఏర్పాటు చేయగా అక్కడ నుంచి జేవీకే కిట్లను మండలంలోని 67 పాఠశాలకు తరలిస్తున్నట్టు ఎంఈఓ తాతబ్బాయిదొర తెలిపారు. హెచ్‌ఎం టి.సూరారెడ్డి, వైస్ ఎంపీపీ చప్పా చంద్రరాణి, ఉపాధ్యాయులు, సీఆర్పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యకు మరింత ప్రోత్సాహం



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

చింతూరు: ఎర్రంపేట, బలిమెల, చింతూరులలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జన భాగీదారి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సీడీపీవో విజయగౌరి మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను ప్రొత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాల అవశ్యకతపై అవగాహన పెంపొందించేందుకు జనభాగీదారీ కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. మాజీ సర్పంచ్ జానకమ్మ, మల్లికార్జునరావు, రాజు, మంగతాయారు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



కిముడుపల్లిలో గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



యార్లగడ్డలో స్థానికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

జి.మాడుగుల: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నామని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని వంజరి–2 గ్రామ సచివాలయం పరిధిలో కిముడుపల్లి, వేర్ల మామిడి, గొయ్యిగుంట, ముళ్లమెట్ట, బలిజపేట, దేవరాపల్లి గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో 240 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటి పరిష్కరించే అవకాశం కలగడం ఆనందంగా ఉందన్నారు. శివారు గ్రామాల్లో కూడా పర్యటించి, ఆదివాసీల సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్‌లు కొర్రా రవి, కొండబాబు, ఎంపీటీసీ వంతాల మధు, వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండం నాయుడు, కన్వీనర్లు కళ్యాణ్, బాలయ్యపడాల్, మత్స్యకొండబాబు, సోషల్ మీడియా కన్వీనర్ లక్ష్మణ్, నాయకులు సన్యాసిరావు, అచ్చిబాబు, సత్యనారాయణ, అశోక్, రమేష్, బాలకృష్ణ రాయులు తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేసిన ఘనత జగనన్నదే

వై.రామవరం: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి చెప్పారు. మండలంలోని యార్లగడ్డ సచివాలయం పరిధిలోని పైడిపుట్ట, యార్లగడ్డ, కొమరవరం, శేషరాయి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి పాల్గొన్నారు. ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామల్లో 250 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లోని సమస్యలను తక్షణమే పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పార్టీలకతీతంగా పారదర్శకంగా అన్ని వర్గాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలుచేస్తోందన్నారు. ప్రజా సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేసిందని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు అండగా ఉండి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్నే గెలిపించుకుందామన్నారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, వైస్ ఎంపీపీలు వలాల విశ్వమ్మ, ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ పల్లాల పద్మావతి, మండల పార్టీ కన్వీనర్ మామిడి అప్పారావు, నాయకులు గుడ్ల త్రిమూర్తులు, కరణం కనకరాజు, మద్దికొండ భారతిబాబు, ఎం.నారాయణరావు, బచ్చలి రమేష్, డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకర్, సచివాలయ కార్యదర్శులు మధుసూధనరాజు, పి.భార్గవచరణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

కూనవరం: మండలంలోని కాచవరం పంచాయతీలో ఎంపీపీ నిధులు రూ.5లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో పాటిస్తూ రోడ్డు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మండలాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందన్నారు. ఎంపీటీసీ గారపాటి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ శామంతుల వెంకన్న, నాయకులు గుజ్జా బాబు, సోందె పాపారావు, అరవా దివాకర్, వాసం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరంలో నేడు గడప గడపకు

రంపచోడవరం: రంపచోడవరం మండలంలోని మత్రివాడ, కుంజంవీధి గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారని తెలిపారు. రంపచోడవరం సచివాలయం పరిధిలో మత్రివాడ నుంచి పెద్దకొండ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాన చేస్తారన్నారు. పార్టీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.